# కల్లాల్లో ధాన్యం .. రైతు కళ్లల్లో దైన్యం

- కేంద్రాలు తెరిచినా కొనుగోళ్లు మరిచారు
- రైతులను భయపెడుతున్న అకాల వర్షాలు
- తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం
- రోడ్ల వెంబడి, పొలాల్లోనే ఆరబెడుతున్న వైనం



ధాన్యం కుప్పచేస్తున్న రైతులు



రోడ్డు వెంబడి ధాన్యం ఆరబోస్తున్న దృశ్యం

**రాయదుర్గం:** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించడానికి అన్నదాతలు ముప్పుతిప్పలు పడుతున్నారు. విత్తు నుంచి విపత్తు దాకా ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. కోతకొచ్చిన సమయంలో అకాల వర్షాలు, వడగండ్లు, ఈదురుగాలులతో వరిపైరు నేలకొరిగింది. 70 శాతం తుడిచిపెట్టుకుపోయింది. గింజలన్నీ నేలరాలిపోయాయి. ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు రావాల్సిన దిగుబడి 20–25 బస్తాలకే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం కంటితుడుపు చర్యలు చేపట్టింది. రబీలో వరి ధాన్యం కొనుగోలు చేస్తామని వారం రోజుల క్రితం కణేకల్లులో కొనుగోలు కేంద్రం తెరిచినా, ఒక్క బస్తా కూడా కొనలేదని రైతులు నిట్టూరుస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని రబీ సీజన్‌లో బోరు బావుల కింద 1,810 హెక్టార్లలో బీపీటీ, ఎన్‌ఎల్‌ఆర్, ఆర్‌ఎన్‌ఆర్, 64 రకం, కావేరి, సోనా రకాలు వరి సాగుచేశారు. ఇందులో హెచ్‌ఎల్‌సీ ఆయకట్టు పరిధిలోని కణేకల్లులో 1273, బొమ్మనహాళ్‌లో 456 హెక్టార్లలో మెజార్టీ క్రాప్ సాగులోకి వచ్చింది. బొమ్మనహాళ్, డి హీరేహాళ్ మండలాల్లోనూ వరి కొనుగోలు కేంద్రాలు తెరిచామని అధికారులు చెపుతున్నా .. దాన్యం కొనుగోలు మాత్రం మరిచారు. కనీసం గన్నీ సంచులు కూడా అందించకపోవడంతో పొలాలు, రోడ్ల వెంబడి రోజంతా ఆరబోయడం, రాత్రికి కుప్పలు చేసి, అక్కడే నిద్రించడం రైతుకు భారంగా మారింది.

**ఈ–క్రాప్ చేయక చిక్కులు..**

రైతుల వివరాలు ఈ–క్రాప్ జాబితాలో లేక కొనుగోలుకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దీంతో కేంద్రాలు తెరిచినాబస్తా ధాన్యం కొనలేని దుస్థితి. కనీసం గన్నీ సంచులైనా అందించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అకాల వర్షాలకు వడ్లు ముద్దయితే, తేమశాతం ఎక్కువైనచోట మొలకలు వస్తున్నాయి.

**మద్దతు ధరకు అమ్ముకోలేక ఆందోళన**

కష్టపడి పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోలేక అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సాధారణ రకానికి క్వింటా రూ.2,300, ఏ గ్రేడ్ కు రూ.2,320 గా మద్దతు ధర ప్రకటించింది. అయితే బయట మార్కెట్లో క్వింటా రూ.1,700 నుంచి రూ.1800 లోపే ధర పలుకుతోంది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బయట మార్కెట్‌తో పోలిస్తే రూ.520 అదనంగా ఆదాయం పొందొచ్చు. రైతు వద్ద ధాన్యం నిల్వ ఉండడాన్ని చూసి దళారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. రూ.500 కోసం నిల్వలు పేర్చుకుంటే మరిన్ని నష్టాలు, కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని భయంచెప్పి తూకాలు కొట్టేస్తున్నారు.

### కౌలు రైతుకు కన్నీళ్లు



గ్రామంలో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట వేశా. సాగు ఆరంభం నుంచి పంటను కాపాడుతూ వచ్చా. తీరా కంకులు ఏర్పడిన తర్వాత వడగండ్ల వాన, ఈదురుగాలులతో నట్టేట మునిగా. సగం పంట నేలకొరిగి, గింజలు రాలిపోయాయి. చేతికి దక్కిన అరకొర ధాన్యమైనా మద్దతు ధరకు అమ్ముదామంటే ఈ–క్రాప్ చేయించలేదని అధికారులు సతాయిస్తున్నారు. – రామాంజనేయులు, ఎర్రగుంట, కణేకల్లు మండలం

### కొనుగోళ్లు ప్రారంభించాలి



రబీలో 13 ఎకరాల్లో వరి పంట సాగుచేసి తీవ్రంగా నష్టపోయా. పండిన అరకొర ధాన్యం మద్దతు ధరతో విక్రయిద్దామంటే ఈ–క్రాప్ పేరిట రైతులను తిప్పుకుంటున్నారు. చేసేది లేక చాలా మంది అందిన కాడికి దళారులకు అమ్ముకుని మరింత నష్టాలు మూటకట్టుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణం లావాదేవీలు చేపట్టాలి. రైతులందరికీ గన్నీ సంచులు కొరత లేకుండా అందించాలి. – వన్నూర్‌స్వామి, రైతు, గోనేహాళ్, బొమ్మనహాళ్ మండలం

### ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనాలి



పేరుకే కొనుగోలు కేంద్రాలు తెరిచారు. వారం రోజులు దాటినా బస్తా ధాన్యం కూడా కొనలేదు. రబీలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. తడిచిన ధాన్యం కూడా సమానంగా ధర నిర్ణయించాలి. సత్వరం కొనుగోలు కేంద్రాల్లో తుకాలు చేపట్టాలి. ఈ–క్రాప్ మెలికపెట్టి అర్హత కలిగిన రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు. అవసరమైన ప్రతి రైతుకూ గన్నీ సంచులు అందించి భరోసా కల్పించాలి. లేకుండా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులతో కలసి ఉద్యమిస్తాం. – మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

### కొనుగోలు కేంద్రాలు తెరిచాం

జిల్లాలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డి హీరేహాళ్ తో పాటు ఆయా మండలాల్లోనూ వరి కొనుగోలు కేంద్రాలు తెరిచాం. ఈ–క్రాప్ ఆధారంగా కొనుగోలు మొదలుపెట్టాం. కొరత లేకుండా గన్నీ సంచులు అందిస్తాం. సోమవారం నుంచి ధాన్యం సేకరణ ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నియమా నిబంధనల ప్రకారం రైతులందరికీ న్యాయం చేస్తాం. మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం. – రమేష్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం, అనంతపురం

## క్లుప్తంగా

### ఐక్యంగా పోరాడుదాం



వడ్డెర్ల సంఘం పట్టణ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** వడ్డెర్ల సమస్యలపై ఐక్యంగా పోరాడుదామని ఆ సంఘం రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వడ్డెర్ల ఐక్యతతో కూడిన చర్చావేదిక నిర్వహించారు. వడ్డెర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డెర్లు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వడ్డెర్ల సంఘం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా సంజీవరాయుడు, ఉపాధ్యక్షులుగా లాలుస్వామి, శివ, ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య, కార్యదర్శిగా చిన్నబాబు, శివకుమార్, కోశాధికారిగా గంగరాజు, గౌరవసలహాదారుగా రమేష్‌బాబు, మారెన్న, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**శెట్టూరు:** మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధం రామిరెడ్డి నివాసంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మంజునాథ, ఎంపీపీ లక్ష్మీదేవితో కలిసి వధూవరులు పవిత్ర, మధుసూదన్‌రెడ్డిని ఆశీర్వదించారు. రిసెప్షన్‌కు కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ తిప్పేస్వామి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రఘునాథ రెడ్డి, మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, జిల్లా పార్టీ అనుబంధ విభాగాల నాయకులు హరినాథ రెడ్డి, మహాబలి, శ్రీనివాస్ రెడ్డి, కటారు మంజునాథ రెడ్డి, ఖాసిమ్, సర్పంచులు సత్యనారాయణ రెడ్డి, గొర్ల గంగాధర, నాయకులు బొమ్మజ్జి రమేష్, వీరభద్రప్ప, జీవన్ గోపాల్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, టైలర్ వన్నూరుస్వామి, లింగప్ప, ఆదిశేషు, రఘునాథ శెట్టి, అనంత రెడ్డి, ఆనందప్ప, శ్యామ్, తంజిల్, వీరాంజనేయులు, శెట్టూరు తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### రాయితీతో దాణా పంపిణీ

**వజ్రకరూరు:** ఉరవకొండ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని పాడి రైతులకు 50 శాతం రాయితీతో సమీకృత దాణా పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్ తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 15 మండలాల రైతులకు దాణా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 50కిలోల దాణా సంచి పూర్తి ధర రూ. 1110 కాగా, సబ్సిడీతో రూ.555కు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండలానికి 25 మెట్రిక్ టన్నులు (ఒక లారీ) పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

### వేసవి శిక్షణ శిబిరం

**వజ్రకరూరు:** వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధి కారి మునెమ్మ కోరారు. ఆదివారం వజ్రకరూరులోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ మాట్లాడారు. జూన్ 6 వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. సామాజిక కార్యకర్త బెంజిమెన్, రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పేద ముస్లిం పిల్లలకు ఖత్నా



ఖత్నా చేయించుకున్న పిల్లల తల్లిదండ్రులకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్:** రాయదుర్గం అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 142 మంది పేద కుటుంబాల పిల్లలకు ఉచిత ఖత్నా (సున్తీ) నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని జామియా అన్వరుల్ ఉలుమ్ మదరసాలో ఖత్నా కార్యక్రమం జరిగింది. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, సభ్యుల చేతుల మీదుగా సరుకుల కిట్లు అందించారు. ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, కమిటీ కార్యదర్శి లడ్డు మహమ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు డ్రైవర్ బాష, ఖాసీం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకీర్, షాకీర్ పాల్గొన్నారు.

**ఉరవకొండ:** హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో జామియా తాసీరియా ఎడ్యుకేషన్, చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖత్నా క్యాంపు నిర్వహించా రు. ఆలీ, నూరానీ మెడికల్స్ అధినేతలు స లీం, కరీంలు మందులు అందించారు. వైద్యులు ఖాజాపీరా, నిజాముద్దీన్, బాషా, లోక నాథ్, నవాజ్ ల్యాబ్ బళ్లారి రహంతుల్లా పాల్గొ న్నారు. ఆయుర్వేద వైద్యులు మహ్మద్ అలీ తాసీర్ షిఫా ఖానాసెంటర్ మందులు అందించారు. ఆల్ జామీయా తాసీరియా ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ తాసీర్‌హుసేనీ ఉల్ ఖాద్రీ పాల్గొన్నారు.

### ఉప్పర సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



ఉరవకొండలో ర్యాలీ చేస్తున్న భగీరథ ఉప్పర సంఘం నాయకులు

**ఉరవకొండ:** భగీరథ ఉప్పర (సగర) సంఘం ఆధ్వర్యంలో భగీరథ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉప్పర కాలనీ నుంచి భగీరథుడు చిత్రపటంతో భారీ ర్యాలీ చేశారు. సంఘం అధ్యక్షుడు ఉప్పర ధనంజయ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజేష్‌లు మాట్లాడుతూ భగీరథుడు గంగను భువికి తీసుకొచ్చిన మహనీయుడన్నారు. అనంతరం ఉప్పర కాలనీలో ఏర్పాటు చేసిన సభలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రణవి, పవన్‌తో పాటు ఇంటర్‌లో టాపర్స్ నిలిచిన హర్ష, ఉరవకొండ ఎస్‌బీఐ మేనేజర్ వీరంద్రనాథ్, ఫీల్డ్ ఆఫీసర్ రవిని సన్మానించారు. బెంగళూరుకు చెందిన ఉప్పర శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

### అ'పూర్వ' కలయిక



ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణంలోని గోల్డెన్స్ బెల్స్ పాఠశాలలో 2006–07 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులంతా ఒకే వేదికపై కలిసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండర్ డేవిడ్ , ప్రిన్సిపాళ్లు జీన్స్, అరుణ్, ఉపాధ్యాయులు రూపేష్, డీవీ సురేష్, బాబురావు, మురళీ కృష్ణ, జోశి, సైరాబాను, నందిత, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బచ్చనకల్లేశ్వరస్వామి పట్టాభిషేకం



పూజలు చేయిస్తున్న సమన్వయకర్త మెట్టు



ఉత్సవాల్లో పాల్గొన్న మెట్టు గోవిందరెడ్డి

**కణేకల్లు:** మండలంలోని హనకనహాళ్‌లో కురుబల ఇలవేల్పు, ఆరాధ్య దైవం బచ్చనకల్లేశ్వరస్వామి పట్టాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ వేడుకలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో కురుబలు హాజరయ్యారు. ఆదివారం ఉత్సవమూర్తులు బచ్చనకల్లేశ్వరస్వామి, వసికేరప్పస్వామికి పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ఆహ్వానిత దేవుళ్లను అలంకరణ చేసి, గ్రామశివారు వరకు ఊరేగించారు. బయట ప్రాంతం నుంచి వచ్చిన వారి కోసం ఆలయ కమిటీ అవసరమైన ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక భోజన కౌంటర్లతో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మాజీ మంత్రి శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, సర్పంచు రామాంజనేయులు, వైస్ సర్పంచు అనిల్‌కుమార్, మాజీ ఎంపీటీసీ రమణరెడ్డి, మాజీ సర్పంచు తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వేమన, వివిధ విభాగాల నేతలు మారెంపల్లి మహేష్, కెంగుట రామిరెడ్డి, తుకారం, బోర్‌వెల్ ఆనందరెడ్డి, పెన్నోబులేశు, సుంకన్న, హనుమంతరాయుడు, శివరాజు, బోయ యోగేష్, అనిల్, పూజారి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

**వైభవంగా జంబన్నతాత ఉత్సవాలు**

**రాయదుర్గం:** డీ హీరేహాళ్ మండలంలోని పులకుర్తిలో కురుబల ఆరాధ్యదైవం జంబన్నతాత ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. కురుబలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మెట్టు గోవిందరెడ్డిని సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఐటీవిభాగం తాలూక అధ్యక్షుడు బోర్‌వెల్ ఆనందరెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు తొండ వెంకటేశులు, జిల్లా కార్యదర్శి సందీప్ పాటిల్, స్థానిక సర్పంచ్ దొణప్ప, సోములాపురం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, సాయకులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీ సేవలు ఆగితే పేదల జీవితాలు దుర్భరం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** ఆర్డీటీ సేవలు ఆగితే పేదల జీవితాలు దుర్భరంగా ఉంటాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ రూరల్ సమన్వయకర్త ఎర్రిస్వామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6న స్థానిక తొగట వీరక్షత్రియ కల్యాణ మంటపంలో ఆర్డీటీ సేవల కొనసాగింపు – ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ అంశాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా జిల్లాలో విద్య, వైద్యం, పర్యావరణం, పక్కా గృహాల నిర్మాణం లాంటి అనేక గొప్ప కార్యక్రమాలను ఆర్డీటీ చేపడుతోందన్నారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అనంత రూపురేఖలు మార్చారన్నారు. ఈ అంశంపై చర్చించడానికి ఈనెల 6న అన్ని రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీలు, కుల, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, ఆపద్బాంధవ ట్రస్టు ప్రతినిధి మురళీ, నూర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న భీమ, కిష్టయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

**శెట్టూరు:** ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. గ్రామస్తులు చెవుల కిష్టప్ప, లింగప్ప, రామకృష్ణ, టైగర్ వన్నూర్‌స్వామి, బోయ తిప్పేస్వామి, నాగభూషణ పాల్గొన్నారు.

**సమన్వయంతో పనిచేస్తా**

**బొమ్మనహాళ్:** వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అందరినీ కలుపుకొని సమన్వయంతో పార్టీ కోసం పనిచేస్తామని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ట్రేడ్‌యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశమిచ్చిన జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టుగోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంక్షిప్త సమాచారం

**'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోండి**

**వజ్రకరూరు:** మండలంలోని రైతులు 'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మధుకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు విశిష్ట నంబర్‌ను నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 13,757 మంది రైతులు ఉండగా, 9100 మంది రైతులు విశిష్ట నంబర్‌ను నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

**పేకాట రాయుళ్ల అరెస్ట్**

**రాయదుర్గం:** పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డుకు సమీపంలోని ఓ తోటలో గుట్టుగా పేకాట ఆడుతుండగా పది మంది పట్టుబడ్డారని అర్బన్ సీఐ జయానాయక్ తెలిపారు. వీరి నుంచి రూ.75,840 నగదు, 7 ద్విచక్ర వాహనాలు, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో కూటమి నాయకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక**

**వజ్రకరూరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందని తహసీల్దార్ నరేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు, రై తులు సమస్యలపై వినతులు అందించొచ్చన్నారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

**కళ్యాణదుర్గం రూరల్:** మండల కేంద్రంలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)లో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు, బ్యాక్‌లాక్ 4వ తరగతిలో 38 సీట్లు, 5వ తరగతిలో 34, 6వ తరగతికి 20 సీట్లు, 7వ తరగతికి 18 సీట్లు, 8వ తరగతికి 4, తొమ్మిదో తరగతిలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు సెల్: 9963205664, 9603677505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు**

**కూడేరు:** లెప్రసీ కాలనీ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొటుకూరుకు చెందిన నరసింహులు, అతని ఆరేళ్ల కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. నరసింహులు ద్విచక్ర వాహనంపై లెప్రసీ కాలనీ నుంచి అవతలి వైపునకు రోడ్డు క్రాస్ చేస్తుండగా ఉరవకొండ వెళ్తున్న కారు ఢీకొట్టింది. గాయపడిన వారిని పోలీసులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

**నీళ్ల ట్యాంకరు అపహరణ**

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణంలోని కన్నేపల్లి రోడ్డులో నరసిహులు అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ( నీళ్లట్యాంకర్)ను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు తెలిపిన మేరకు.. పట్టణానికి చెందిన నరసిహులు శనివారం సాయంత్రం కన్నేపల్లి రోడ్డు వద్ద తన స్థలంలో ట్రాక్టర్‌తో పాటు ట్యాంకర్‌ను ఉంచి గేట్‌కు తాళం వేసి ఇంటికెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా ట్రాక్టర్ తోపాటు నీళ్ల ట్యాంకరు కనిపించలేదు. దీనిపై బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**బైక్ అదుపు తప్పి ముగ్గురికి తీవ్రగాయాలు**

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి బైక్ అదుపు తప్పి భవన నిర్మాణ కార్మికులు ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పైతోట నుంచి రాయదుర్గానికి వస్తుండగా చెక్‌పోస్టు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పైతోటకు చెందిన స్వామి , పాలయ్య, సిద్దలింగకు రక్తగాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం స్వామి, పాలయ్యలను అనంతపురానికి తరలించారు.

**13న టోల్‌గేట్ వసూలుకు వేలంపాట**

**రాయదుర్గంటౌన్:** సరైన ధర రావడం లేదని ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన దేవదాయశాఖ పరిధిలోని రాణీఛత్రం స్థలంలో టోల్ గేట్ వసూలుకు బహిరంగ వేలం ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాణీ ఛత్రం ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్, తోపుడు బండ్ల వ్యాపారాల నుంచి టోల్ గేటు రుసుం వసూలుకు నిర్వహించిన వేలంపాట ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. కాగా పాటదారుల మధ్య గొడవలు రావడంతో వేలం ఈనెల 1న జరిగిన వేలం పాట వాయిదా పడింది. గతేడాది టోల్ గేట్ సుంకం వసూలును రూ.10 లక్షలకు కేటాయించగా, ఈసారి పాటదారులు సిండికేట్ అయి తక్కువ ధరకు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

**సబ్సిడీ ఎరువులు సరఫరా చేయాలి**

**కుందుర్పి:** సబ్సిడీ ఎరువులు, పురుగు మందులను సత్వరమే అందించాలని ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మహిళా విభాగం తాలూకా అధ్యక్షుడు నాగలక్ష్మి, ఐటీ విభాగం డివిజన్ అధ్యక్షుడు మరిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సబ్సిడీ ఎరువుల సరఫరాపై పట్టించుకోవడంలేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏటా మే నెలలోనే సబ్సిడీ ఎరువులు ఆర్‌బీకేలకు చేరేవన్నారు.

**వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి జయంతి**

**బొకుగుప్ప:** మండల కేంద్రంలోని వాసవీదేవి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి 18 రకాల రసాలు, సుగంధ ద్రవ్యాలు, వనమూలికలు, పంచామృతాభిషేకాలు అనంతరం క్షీరాభిషేకం చేశారు. ఆర్యవైశ్యులు కలశాలను ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం వెండిపూత రథంలో అమ్మవారి చిత్ర రూపంతో గ్రామోత్సవం నిర్వహించారు.

### పార్టీ బలోపేతానికి మరింత కృషి



హనుమంతరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**కళ్యాణదుర్గం రూరల్:** వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమన్వయంతో మరింత కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోళ్ల సూరి, ఎంపీటీసీ భాస్కర్, తాలూకా మున్సిపాలిటీ అధ్యక్షుడు దొడగట్ట మురళి, తాలూకా దివ్యాంగుల అధ్యక్షుడు పాతలింగ, మల్లాపురం మల్లి పాల్గొన్నారు.


## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



సాముునాయక్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**వజ్రకరూరు:** అప్పుల బాధతాళ లేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న గిరిజన రైతు సబావత్ సాము నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు నాయక్ అన్నారు. వెంకటాం పల్లిపెద్దతండాకు చెందిన సబావత్ సామునాయక్ అప్పుల బాధతాళలేక ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులునాయక్, ఉపాధ్యక్షుడు వడిత్యా గోవిందునాయక్, జిల్లా కార్యదర్శి సాకే ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పురుషోత్తం తదితరులు పెద్ద తండాకు చేరుకొని సామునాయక్ మృతదేహం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచు కొర్రాశివాజీనాయక్, ఉప సర్పంచు వెంకటేష్‌నాయక్, సామాజిక కార్యకర్త నాగరాజునాయక్, నాయకులు సామా నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దాహం కేకలు



దర్గాహొన్నూరులో ఎడ్లబండిలో తాగునీరు తెచ్చుకుంటున్న దృశ్యం

**బొమ్మనహాళ్:** మండలంలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, తారకాపురం, కొత్తపల్లి, దేవగిరి, కొలగానహళ్లి, ఏళంజి, లింగదహాళ్, నేమకల్లు తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది.ఇటీవల గోవిం దవాడ బీసీ కాలనీకి నీరు అందడం లేదని కాలనీవాసులు సచివాయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. దర్గాహొన్నూరులో తాగునీటి పథకం బోర్లు సక్రమంగా పనిచేయక పోవడంతో వన్నళ్లికి వెళ్లి ద్విచక్ర వాహనాలు, ఎడ్లబండ్లతో నీరు తెచ్చుకుంటున్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాలకు దాదాపు 25 రోజులుగా తాగునీరు రావలేదు.దీంతో సమస్య మరింత తీవ్రమైంది.

## దారిద్ర్యం తీరేదెన్నడో..?



గుంతలు పడి అధ్వానంగా ఉన్న కరుట్లపల్లి–పి.నారాయణపురం రోడ్డు

**కూడేరు:** మండలంలోని కడదరగుంట క్రాస్ నుంచి కరుట్లపల్లి– పి.నారాయణపురం వెళ్లే రోడ్డు పొడవునా గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా తయారైంది. కరుట్లపల్లి, పి.నారాయణపురం ప్రజలే కాకుండా ఈ రోడ్డు మార్గం గుండా ఆత్మకూరుకు కూడేరు నుంచి వాహనాలు అధికంగా వెళ్తుంటాయి. రోడ్డు గుంతలు పడి ప్రయాణం నరకంగా మారింది. వాహనాలు దెబ్బతింటున్నాయని, అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నట్లు వాహనదారులు, ప్రజలు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.